సాక్షి మెదక్

శుక్రవారం : 23 : మే : 2025



విజ్ఞాన నైపుణ్యం

ఐదేళ్లుగా వేసవి ప్రత్యేక శిబిరం నిర్వహిస్తూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుతున్నారు.

వివరాలు 8లో ▸



'మురుగు'తో అవస్థలు

రేగోడ్‌లో మురుగు కాలువలు వ్యర్థాలతో నిండి అపరిశుభ్రంగా మారాయి.

వివరాలు 9లో ▸

నేడు డయల్ యువర్ డీఎం

మెదక్ మున్సిపాలిటీ: శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సమస్యలపై ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7842651592 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

న్యూస్‌రీల్

భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ, అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: భాగ్యరెడ్డి వర్మ గొప్ప సామాజిక సంఘ సంస్కర్త అని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి కొనియాడారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనానికి వ్యతిరేకంగా, జోగిని, దేవదాసి వ్యవస్థల నిర్మూలనకు భాగ్యరెడ్డి వర్మ విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శైలెందర్, సిబ్బంది పాల్గొన్నారు.

24న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గేట్ వద్ద గల ఎంజేపీ (మహాత్మ జ్యోతి బాపూలే) బీసీ గురుకుల పాఠశాలలో ఈనెల 24వ తేదీన బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్‌సీఓ గౌతంకుమార్ రెడ్డి, జిల్లా కన్వీనర్ హరిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ఎంజేపీ గురుకులాల్లో బాలురు, బాలికలకు సంబంధించి 979 బ్యాక్‌లాగ్ సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రవేశ పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులు ఈనెల 24వ తేదీన తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలకు సంబంధిత సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

లబ్ధిదారుల ఫొటో తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ లబ్ధిదారుల ఫొటోతో పాటు, ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో ఫొటో తీసి, దానితో పాటు లబ్ధిదారుడి ఆధార్‌కార్డు తప్పనిసరిగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని నర్సాపూర్ డీఎల్‌పీఓ సాయిబాబా అన్నారు. గురువారం మండల పరిధిలోని చండూర్ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల తుది నివేదిక ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఏపీఓ శ్యాం, ఈసీ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

తొలి రోజు 114 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొత్తం 5,840 మంది విద్యార్థుల కోసం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 1,165 మందికి గానూ 1,080 మంది హాజరుకాగా, 85 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర పరీక్షకు 369 మందికి గానూ 340 మంది హాజరు కాగా, 29 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

దేశం కోసం సైనికులుగా మారుదాం



మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

రామాయంపేట(మెదక్): ప్రధాని నరేంద్ర మోదీ నీడలో ఎలాంటి భయాందోళన లేకుండా అందరం హాయిగా జీవిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన తిరంగా యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం కోసం అందరం సైనికులుగా మారుదామని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌తో మన దేశ కీర్తి, ప్రతిష్టలు పెరిగాయన్నారు. పహల్గాం సంఘటన తర్వాత పాకిస్తాన్ చరిత్ర ప్రపంచానికి తెలిసిందన్నారు. మన దేశంలో ఉంటూ పాకిస్తాన్‌కు పరోక్ష మద్దతు పలుకుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు అవినాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రెండో విడత @8,260

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

- మండలాల వారీగా ఎంపిక ప్రక్రియ పూర్తి
- అత్యధికంగా పాపన్నపేటకు 670 ఇళ్లు
- అత్యల్పంగా నార్సింగికి 77 మాత్రమే..

ఇందిరమ్మ రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. జిల్లాకు 8,260 ఇళ్లను కేటాయించిన అధికారులు జాబితాను సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇల్లు లేని నిరుపేదలు, సొంత స్థలం ఉన్నవారు, పూరి గుడిసెలు, రేకుల షెడ్డు, పురాతన పెంకు టిల్లు గల వారికి ప్రాధాన్యం ఇచ్చారు. త్వరలో వీరికి మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు సంబంధిత ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

– మెదక్‌జోన్



జిల్లాలో 21 మండలాలతో పాటు 4 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈఏడాది జనవరి 26వ తేదీన పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి ఒక గ్రామం చొప్పున 21 గ్రామాల్లో 1,555 ఇళ్లను మంజూరు చేశారు. అందులో 398 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా, వాటిలో 156 బెస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు బిల్లులు సైతం అందాయి. నిబంధనల ప్రకారం నిర్మిస్తున్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు ఎంబీ రికార్డులు చేస్తుండగా, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు తగు సూచనలు చేస్తున్నారు.

ఇప్పటివరకు జిల్లాకు 9,815 ఇళ్లు

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో పైలెట్ ప్రాజెక్టు కింద మొదటి విడతలో మంజూరైనవి కలుపుకొని 7 వేల ఇళ్లు కేటాయించారు. అదేవిధంగా ఆందోల్ నియోజకవర్గంలోని రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గం మండలాలతో పాటు ఖేడ్‌లోని పెద్దశంకరంపేట, దుబ్బాకలోని చేగుంట, నార్సింగి, గజ్వేల్‌లోని తూప్రాన్, మనోహరాబాద్ మండలాలతో పాటు తూప్రాన్ మున్సిపాలిటీ సైతం జిల్లాలో ఉండటంతో పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకు 1,555 ఇళ్లు మంజూరయ్యాయి. 2వ విడతలో జిల్లాకు 8,260 ఇళ్లను మంజూరు చేశారు. దీంతో ఇప్పటివరకు మొదటి, రెండో విడతలో కలిపి జిల్లాకు 9,815 ఇళ్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా అత్యధికంగా పాపన్నపేటకు 670 ఇళ్లను ఎంపిక చేయగా, అతి తక్కువగా నార్సింగి మండలానికి కేవలం 77 ఇళ్లు మాత్రమే కేటాయించారు.

మండలాల వారీగా కేటాయింపు

హవేళిఘణాపూర్ 462, మెదక్ 312, నార్సింగి 77, నిజాంపేట 304, పాపన్నపేట 670, రామాయంపేట 286, చిన్నశంకరంపేట 471, చిలప్‌చెడ్ 174, కొడిపల్లి 311, కొల్చారం 316, నర్సాపూర్ 314, శివ్వంపేట 384, వెల్దుర్తి 286, మాసాయిపేట 161, అల్లాదుర్గం 400, రేగోడ్ 280, టేక్మాల్ 430, పెద్ద శంకరంపేట 530, చేగుంట 509, నార్సింగి 145, మనోహరాబాద్ 107, తూప్రాన్ 223 ఇళ్లను కేటాయించారు.

మున్సిపాలిటీల్లో..

ఇందిరమ్మ రెండో విడతలో మెదక్ మున్సిపాలిటీకి 400, రామాయంపేట 100, నర్సాపూర్ 500, తూప్రాన్‌కు 108 ఇళ్లను కేటాయించారు.

త్వరలో మంజూరు పత్రాలు



ప్రొసీడింగ్ పత్రాలు అందగానే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకే లబ్ధిదారులను ఎంపిక చేశాం. గ్రామ సభల్లో ఆమోదం తెలిపిన వా రికే ఎంపిక పక్రియలో ప్రాధాన్యం ఇచ్చాం.

– మాణిక్యం, హౌసింగ్ పీడీ



మనోహరాబాద్: పలాటా నర్సరీలో మొక్కలకు నీరు పడుతున్న సిబ్బంది

వన మహోత్సవానికి సన్నద్ధం

జిల్లాలో 37 లక్షలు నాటేలా ప్రణాళిక

మెదక్ కలెక్టరేట్: వన మహోత్సవానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. వర్షాలు ప్రారంభం కాగానే పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 37 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 15 శాఖలను భాగస్వాములు చేయనున్నారు. ఇప్పటికే కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో సమీక్షించి లక్ష్యాలను నిర్దేశించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రధాన రోడ్ల పక్కన, పొలాల వెంట మొక్కలు నాటాలని నిర్ణయించారు. గతేడాది నాటిన మొక్కలు కొన్ని చోట్ల పలు కారణాలతో ఎండిపోయాయి. ఈసారి అలా జరగకుండా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాటిన మొక్కల్లో 80 శాతం బతికేలా చర్యలు చేపడుతున్నారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం సిబ్బందికి ఆదేశాలు సైతం జారీ చేశారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 479 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. అటవీశాఖకు 6, డీఆర్డీఓకు సంబంధించి 469 నర్సరీలు ఉన్నాయి. అలాగే జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, 4 నర్సరీలు ఉన్నాయి. అందులో మెదక్ మున్సిపాలిటీలో 2,55,300 మొక్కలు, నర్సాపూర్‌లో 2,22,000, రామాయంపేట 55,500, తూప్రాన్‌లో 1,33,200 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పలు రకాల మొక్కలు

ఈ ఏడాది వన మహోత్సవంలో నాటేందుకు ప్రస్తుతం జిల్లాలోని అన్ని నర్సరీల్లో 37 లక్షల 44 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో బాదం, సీతాఫలం, నమిలినార, నిమ్మ, దానిమ్మ, మర్రి, మామిడి, రావి, కానుగ, వెదురు, గచ్చకాయ, గుల్‌మొహర్, రావి, తురాయి, రేన్ ట్రీ, గార్డెనింగ్ మొక్కలు, గోరింటాకుతో పాటు పూలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు.

శాఖల వారీగా లక్ష్యాలు	
వ్యవసాయం	31,900
డీఆర్డీఓ	20,78,600
అటవీశాఖ	7,20,000
హార్టికల్చర్	63,900
పరిశ్రమలు	30,000
నీటిపారుదల	22,700
మైనింగ్	23,000
పోలీస్	18,400
ఎక్సైజ్	40,600
స్త్రీ, శిశు సంక్షేమం	10,000
విద్య	5,000

విజయవంతం చేస్తాం

జిల్లాలో ఈ ఏడాది పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు అధికారులను సన్నద్ధం చేస్తున్నాం. జూన్ మొదటివారంలో వన మహోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికలు తయారు చేశాం.

– జోజీ, జిల్లా అటవీశాఖ అధికారి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా అధికారులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో వెలుగు లు నింపేదిశగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రగతి సాధించాలన్నారు. మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లు పరిసరాల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది మరోసారి జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షల ద్వారా అధికారులకు పలు సూచనలు సలహాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రామాయంపేట: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

నాణ్యమైన విద్యనందించాలి

డీఈఓ రాధాకిషన్

రామాయంపేట(మెదక్)/చిన్నశంకరంపేట/చేగుంట: శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో అమలు పరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం రామాయంపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ సందర్శించి మాట్లాడారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నార్సింగి జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను పరిశీలించారు. అలాగే చేగుంట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణను సందర్శించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా 1,600 మంది ఎస్జీటీలకు 1,800 మంది స్కూల్ అసిస్టెంట్లకు, ప్రధాన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నా మని తెలిపారు.

కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: కాళేశ్వరం మంచి ప్రాజెక్టు అని సుప్రీం కోర్టు చెప్పడంతో కాంగ్రెస్ నాయకుల కుట్రలు బట్టబయలు అయ్యాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఎడారిగా మారిన లక్షల ఎకరాల భూములు కాళేశ్వరం నీటితో సాగులోకి వచ్చి తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని సుప్రీంకోర్టులో ఇద్దరు జడ్జిల ధర్మాసనం ప్రశంసించారని ఆమె వివరించారు. ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో విఫలం చెందారని ఆరోపించారు. రైతులకు రైతుబంధు, బీమా అందడం లేదని, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. తమ తప్పులు కప్పి పుచ్చుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు విచారణ నోటీసులంటూ కాంగ్రెస్ నాటకాలు ఆడుతుందన్నారు. సీఎం తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలుగుతుందని వాపోయారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రాగౌడ్, సత్యంగౌడ్, సంతోష్‌రెడ్డి, బబియా, వీరేశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

అస్తవ్యస్తంగా విద్యావ్యవస్థ

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో శిథిల భవనాలను పరిశీలించి మాట్లాడారు. నార్సింగి లాంటి పెద్ద గ్రామంలోనే జెడ్పీ పాఠశాల భవనాలు సరిగా లేవని, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాలను మధ్యలో నిలిపివేశారని వాపోయారు. అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయంలో నార్సింగి ప్రాథమిక పాఠశాల, కళాశాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తే, ఈ ప్రభుత్వం వచ్చిన ఆ నిధులను మళ్లించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓ భవనం కోసం నిధులు మంజూరు అయ్యాయని, స్థల సేకరణ పూర్తి చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం వల్లభాపూర్ క్రాస్‌రోడ్‌ను పరిశీలించారు. వెంటనే సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని నేషనల్ హైవే అథారిటీ అధికారి శ్రీనివాస్‌రావును ఆదేశించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాబు, భూపతి రాజు ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

కలెక్టర్ రాహుల్‌రాజ్



నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

టేక్మాల్(మెదక్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం టేక్మాల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. లారీలు సమయానికి రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య లేకుండా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. పూర్తిగా కొనుగోలు చేసి సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లర్లకు పంపాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఐకేపీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అకాలవర్షాల కారణంగా రైతులు ధాన్యాన్ని టార్పాలిన్లతో తడవకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ తులసీరామ్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ

మెదక్ కలెక్టరేట్: దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై భాగ్యరెడ్డి వర్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంటాడుతున్న వర్షం

కొనుగోలు కేంద్రాల్లో కదలని ధాన్యం

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికి వచ్చిన తర్వాత వర్షార్పణం అవుతోంది. అకాలవర్షాలు అన్నదాతలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో నానాతంటాలు పడుతున్నారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షానికి నర్సాపూర్, కొల్చారం మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. సకాలంలో లారీలు రాకపోవడంతో పేరుకుపోయాయి. దీంతో రైతులకు కంటినిండా నిద్ర కరువైంది. ఏ ఒక్క అధికారి తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– నర్సాపూర్ రూరల్/కొల్చారం



పైతర శివారులో వడ్ల బస్తాలకు మొలకలు



ఎనగండ్లలో భారీ వర్షానికి తడిసిన ధాన్యం



కాగజ్ మద్దూర్‌లో ధాన్యం రాశులు

క్లుప్తంగా

పాఠశాలలకు నోటీసులు


నోటీసు అంటిస్తున్న సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, విద్యా శాఖ నిబంధనలు పాటించకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు మండల విద్యా శాఖ అధికారి రచ్చ కిష్టయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలతోపాటు ఇంటర్నేషనల్, సీబీఎస్సీ అనుమతి లేకుండానే ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్న ఓక్లే పాఠశాలకు నోటీసులు జారీ చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో తెలుసుకొని పిల్లలను చేర్పించాలని సూచించారు.

పాఠశాల దశనే విద్యార్థి జీవితంలో కీలకం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి


సూచనలు చేస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

దౌల్తాబాద్ (దుబ్బాక): విద్యార్థి జీవితంలో పాఠశాల దశనే అత్యంత కీలకమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాయపోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజులు వృత్యంతర ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొనడం సంతోషకరమని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయపోల్ మండల విద్యాధికారి సత్య నారాయణ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన శారద ప్లాస్టిక్ వస్తువుల విక్రయం వ్యాపారం చేస్తోంది. 20న వ్యాపారం కోసం కూతురితో కలిసి బయటికి వెళ్లింది. మరుసటి రోజు సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.5 వేల నగదు చోరీ గురైనట్లు గుర్తించారు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో గల లక్ష్మీప్రసన్న కాలనీలోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 29,800 నగదుతోపాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేసవి శిబిరం.. విజ్ఞాన నైపుణ్యం

- పేద విద్యార్థులకు అండగా తెల్లాపూర్ నైబర్ హుడ్
- ఐదేళ్లుగా ఉచితంగా నిర్వహణ
- ఉత్సాహం చూపుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- దాతలు సైతం సహకారం

తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ కావత్ విభాగం పేద విద్యార్థులకు అండగా నిలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐదేళ్లుగా వేసవిలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తూ వారిలో నైపుణ్యాన్ని మరింత పెంచుతున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో నెల రోజులుగా కొనసాగుతున్న వేసవి శిబిరంపై ప్రత్యేక కథనం..

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)


యోగా శిక్షణలో విద్యార్థులు


గణితం, ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ అసోసియేషన్ ద్వారా వారి సమస్యలను పరిష్కరించుకుంటూ సామాజిక సేవలో ముందుంటున్నారు. 2020 నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవిలో పలు అంశాలపై ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. మొదట 40 మంది విద్యార్థులతో మొదలైన శిబిరంలో ప్రస్తుతం 100 మంది పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచేందుకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, గణితశాస్త్రం, యోగా, నృత్యం, వ్యక్తిగత వికాసం, స్వయం రక్షణ, వంటలపై శిక్షణ అందిస్తున్నారు.

స్వచ్ఛందంగా వస్తున్న వలంటీర్లు

వేసవి శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు శిక్షణ అందించేందుకు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ముందుకొస్తున్నారు. వారితోపాటు స్థానిక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, టీషర్ట్‌లను అందిస్తున్నారు. వారిని ఇంటి నుంచి తీసుకురావడానికి బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నా..



వేసవి శిబిరంలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల్లో పాల్గొంటున్నాను. ఎంతో సులభంగా ఇంగ్లిష్ మాట్లాడే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల ఇంగ్లిష్‌పై మరింత పట్టు సాధిస్తున్నాను. ప్రతి రోజూ శిక్షణకు హాజరవుతున్నాను.

– భాగ్యలక్ష్మి, 7వ తరగతి

అర్థమయ్యేలా బోధన



తెల్లాపూర్ నైబర్ హుడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం మాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో గణితశాస్త్రం, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఏదైనా సందేహం వచ్చి అడిగిన వెంటనే మాకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు.

– జస్వంత్, జిల్లా పరిషత్ విద్యార్థి

మంచి స్పందన ఉంది



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రతీ సంవత్సరం ఉచితం వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాం. నైబర్ హుడ్ కవాత్ పేరిట పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం. నైబర్ హుడ్ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– కవిత, నైబర్ హుడ్ కవాత్ కన్వీనర్

దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు



వేసవి శిబిరాలకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు. శిబిరంలో శిక్షణ కోసం విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషం. దాతలు కూడా ముందుకొచ్చి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎడ్యుకేషన్ హబ్‌గా నర్సాపూర్

ఓయూ వైస్ చాన్స్‌లర్ కుమార్ మొగులారం



మాట్లాడుతున్న మొగులారం, పక్కన ఓయూ అధికారులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని తమ పీజీ కాలేజీని అభివృద్ధి చేసి నర్సాపూర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొగులారం తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని ఓయూ పీజీ కాలేజీని సందర్శించి కాలేజీ భవనం, ల్యాబోరేటరీలు, తరగతి గదులు పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆయా జిల్లాల్లో ఉన్న ఓయూ పీజీ కాలేజీలను పలువురు అధికారులతో సందర్శించి సదుపాయాలు, సమస్యలు తెలుసుకుంటున్నామని అందులో భాగంగా స్థానిక కాలేజీకి వచ్చినట్లు తెలిపారు. నర్సాపూర్ ఓయూ పీజీ కాలేజీకి ప్రభుత్వం 10 ఎకరాల భూమి కేటాయించిందని, మరో 10 ఎకరాలు కేటాయించేందుకు తాము సంబంధిత అధికారులతో ప్రయత్నాలు చేయనున్నట్లు చెప్పారు. కాలేజీకి సొంత భవనం లేక నిర్వహణ ఇబ్బందిగా ఉన్నట్లు తాను గుర్తించానన్నారు. భవనం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, జిల్లా పీజీ కాలేజీల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, జిల్లా పీజీ కాలేజీల రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రావు ఉన్నారు. కాగా కాలేజీలో కొనసాగుతున్న కోర్సులు, వసతులను స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి, కాలేజీ ప్రొఫెసర్లు వైస్ చాన్స్‌లర్ బృందానికి వివరించారు.

భాషా లక్ష్యాల సాధనకు శిక్షణ ఉపయుక్తం

రాష్ట్ర తెలుగు పరిశీలకులు భాను ప్రకాశ్


మాట్లాడుతున్న అవుసుల భాను ప్రకాశ్

మెదక్ కలెక్టరేట్: భాషా లక్ష్యాల సాధనకు, విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాలను పెంచేందుకు వృత్యంతర శిక్షణ ఎంతో ఉపయుక్తమని రాష్ట్ర తెలుగు పరిశీలకులు అవుసుల భాను ప్రకాశ్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో జరుగుతున్న తెలుగు ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి గురువారం పరిశీలకులుగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా బోధనలో జరుగుతున్న మార్పులను స్వీకరించాలన్నారు. అంతేకాకుండా భాషా బోధనలో తెలుగు ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, అందుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన బోధన చేయాలని సూచించారు. విద్యార్థులలో సృజన పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జి సుదర్శన మూర్తి, రిసోర్స్ పర్సన్‌లు చిన్న బక్కప్ప, జనార్దన్, సుమన్, సాయిరాం శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో పాడి ఆవులు మృత్యువాత

చేర్యాల(సిద్దిపేట): పాముకాటుతో రెండు పాడి ఆవులు మృతి చెందిన ఘటన మండలంలోని ఆకునూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సోంరెడ్డి యశ్వంత్ రెడ్డి అనే రైతు బుధవారం వ్యవసాయ బావి వద్ద ఆవులను కట్టేసి ఇంటికొచ్చాడు. గురువారం ఉదయం చూసేసరికి రెండు ఆవులు మృతి చెంది ఉన్నాయి. పరిసరాల్లో గమనిస్తే పాములు కనిపించినట్లు తెలిపారు. దీంతో పాము కాటుకు గురైనట్లు భావించారు. మృతి చెందిన ఒక్కో ఆవు విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు స్పందించి బాధిత రైతుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖాతా నుంచి డబ్బులు కట్

హత్నూర (సంగారెడ్డి): పీఎం కిసాన్ యాప్ ద్వారా బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు పోయినట్లు ఓ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎరుకల యాదగిరి బ్యాంకు ఖాతా ఉంచి 18న రూ.34 వేలు కట్ అయ్యా యి. తన ఖాతా ఉన్న దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లి అడుగగా పీఎం కిసాన్ యాప్ ద్వారా కట్ అయ్యాయని బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. సైబర్ నేరగాళ్లే ఈ పని చేయొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఓటీపీలు గానీ ఇతర యాప్‌ల ద్వారా లింకులు వస్తే షేర్ చేయొద్దని ఎస్ఐ శ్రీధర్ సూచించారు.

కష్టం నేల పాలు


బోల్తా పడిన లారీ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్, మంగళపర్తి గ్రామాల మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న మలుపు వద్ద గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. మంగళపర్తి ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి వెల్దుర్తి వైపు వడ్ల లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న వడ్ల సంచులు నేలపై పడిపోయాయి. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

దిగబడిన ధాన్యం లారీ

సిద్దిపేటఅర్బన్: బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి మిట్టపల్లిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం లారీ బురదలో దిగబడింది. గురువారం పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ చొరవతో క్రేన్ సాయంతో లారీని బయటకు లాగారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన బిహార్ సర్పంచ్‌లు

గూడెంగడ్డ, నారాయణపూర్ గ్రామాలు సందర్శన


నారాయణపూర్‌లో బిహార్ సర్పంచ్‌ల బృందం

నర్సాపూర్ రూరల్: బిహార్‌కు చెందిన 80 మంది సర్పంచ్‌లు రెండు బృందాలుగా ఏర్పడి నర్సాపూర్ మండలం గూడెంగడ్డ, నారాయణపూర్ గ్రామ పంచాయతీలను గురువారం సందర్శించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (ఎన్ఐఆర్‌డీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను అధ్యయనం చేసేందుకు బిహార్ సర్పంచ్‌లను ఇక్కడికి పంపినట్లు అధికారులు తెలిపారు. డంప్‌యార్డు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇంకుడు గుంతలు, తడి పొడి చెత్త వేరు చేయడం, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ వంటి వాటిని పరిశీలించారు. వారి వెంట ఎన్ఐఆర్‌డీ ప్రొఫెసర్లు అరుణ, ఆశలత ఉన్నారు. గూడెంగడ్డకు వచ్చిన బృందానికి నర్సాపూర్ ఎంపీడీఓ మధులత, నారాయణపూర్ బృందానికి ఎంపీఓ వైద్య శ్రీనివాస్ అభివృద్ధి పనులను వివరించారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని మా వద్ద నిర్వహించేందుకు కృషి చేస్తామని సర్పంచ్‌లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయిబాబా, ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్, గ్రామ కార్యదర్శులు నగేశ్, మల్లేశం, వంశీ కృష్ణ, లక్ష్మణ్ ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



చందాపూర్ గ్రామంలో గోడలపై రాసిన అక్షరాలను చదువుతున్న పిల్లలు

గోడలపై అక్షరాలు.. మర్చిపోవద్దు పిల్లలు

- చందాపూర్ గ్రామంలో వాల్ రైటింగ్స్
- విద్యార్థులు చదివింది వేసవిలో మర్చిపోవద్దని ఓ ప్రధానోపాధ్యాయుడి వినూత్న ఆలోచన


పరమేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం

చిన్నశంకరంపేట(మెదక్): వేసవిలో ఆట విడుపుతో విద్యార్థులు చదివిందంతా మర్చిపోతుంటారు.. అలా చదివిన చదువును మర్చిపోవద్దని వినూత్నంగా ఆలోచించాడు చందాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి. తాను చదువు చెప్పే చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామంలోని పలు గోడలపై తెలుగు, ఆంగ్లం అక్షరాలు, వర్ణమాల, అంకెలు, ఎక్కాలు, గణితం వంటి వాటిని రాయించాడు. గ్రామంలో చిన్నారులు ఆడుకునే చోట, కిరాణ దుకాణాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద రాయడంతో విద్యార్థులు సైతం గోడలపై రాతలను ఆసక్తిగా చదవడం కనిపించింది. పెద్దలు సైతం చిన్నారులతో చదివిస్తున్నారు. వేసవిలో ఆటలపై దృష్టి పెట్టే పిల్లలు చాలా వరకు అక్షరాభ్యాసనం (బేసిక్స్) మర్చిపోతుంటారు. పాఠశాల తిరిగి ప్రారంభించాక ఒక నెలంత రివిజన్స్‌కు పోతుంది. ఇలా కావొద్దని గోడలపై రాయించినట్లు చెప్పుకొచ్చారు.

కొండపోచమ్మ వద్ద ఉజ్బెకిస్తాన్ అధికారులు


సాగర్ వద్ద ఫొటో దిగుతున్న ఉజ్బెకిస్తాన్ అధికారులు

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండల కేంద్రంలో గల కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును గురువారం ఉజ్బెకిస్తాన్ ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. కొండపోచమ్మ నిర్మాణం, నీటి సామర్థ్యం, ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియ గురించి సమగ్రంగా కార్య నిర్వాహక ఇంజనీర్ రఘునాథ్ ప్రసాద్ అధికారుల బృందానికి వివరించారు. నిర్మాణంలో వినియోగించిన ఆధునిక సాంకేతికత, పనుల అమలు విధానం, ఎదురైన విధానాల గురించి ఉజ్బెకిస్తాన్ ఉన్నతాధికారులకు స్పష్టంగా వివరించారు. రిజర్వాయర్ నిర్మాణ లక్షణాలు, భూసేకరణ, భూగర్భజలాలు పెంపకం, ప్రాంతీయ ప్రయోజనాలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే పంపింగ్, కట్టపై అధికారుల బృందం ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. ఈ సందర్శన భారతదేశ సాగునీటి రంగంలో జరిగిన పురోగతిని గ్లోబల్ స్థాయిలో ప్రదర్శించే మంచి అవకాశంగా నిలిచిందని ఉజ్బెకిస్తాన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ మోతియా, ఏఈఈ ప్రశాంత్, సాయి కుమార్‌రెడ్డి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సందర్శన

ములుగు(గజ్వేల్): మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీని గురువారం ఉజ్బెకిస్తాన్ దేశానికి చెందిన ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. డాక్టర్.రేశ్మినాయర్ ఆధ్వర్యంలో పర్యటించిన అధికారుల బృందం ముందుగా కాలనీలో నిర్మాణమైన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి ప్యాకేజీలు విషయమై అడుగగా తహసీల్దార్ ఆరీఫా బృందానికి వివరించారు. అదే విధంగా కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను, సమీపంలో నిర్మాణమైన పరిశ్రమలను పరిశీలించారు.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా యువకుడు మృతి

- మరో యువకుడికి గాయాలు
- డీసీఎంను ఢీకొని బైక్ బోల్తా


మహేశ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వడియారం గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన పిట్ల మహేశ్(21), కాగుల మధు మాసాయిపేటలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి బైక్‌పై చేగుంట వైపునకు వస్తున్నారు. వడియారం శివారులోకి రాగానే బైక్ ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ డీసీఎంను ఢీకొని యువకులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గల దుకాణాల్లో భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరైనా గుర్తిస్తే 87126 56718 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జహీరాబాద్‌లో మరో వ్యక్తి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీ రూమ్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో పసికందు మృతదేహం

అప్పనపల్లిలో దారుణం

- తల్లి ఒడిలోంచి దుండుగులు కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- కన్న తల్లిపైనే అనుమానం?


రెండు నెలల పసికందు


పసికందు మృతదేహంతో రోదిస్తున్న బంధువులు


బావిలోంచి క్రేన్ సాయంతో మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు, ఫైర్‌సిబ్బంది

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో దారుణం జరిగింది. రెండు నెలల పసికందును తల్లి ఒడిలోంచి దుండగులు అపహరించారంటూ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడం.. మృతదేహం గురువారం సాయంత్రం బావిలో లభ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ దారుణ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరుకు చెందిన రామగల్ల శ్రీమాన్, నంగునూరు మండలం నర్మెట్టకు చెందిన కవిత మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి రెండు నెలల క్రితమే కొడుకు పుట్టాడు. ఈక్రమంలో కొన్ని రోజులుగా వీరు అప్పనపల్లిలో శ్రీమాన్ అమ్మమ్మ గ్యార ఎల్లవ్వ ఇంట్లో నివాసం ఉంటున్నారు. డెకరేషన్ పనులు చేస్తున్న శ్రీమాన్ ఈ నెల 17న పని నిమిత్తం తన అక్క ఊరు రుద్రారం వెళ్లాడు. ఈక్రమంలో సాయంత్రం వేళ ఇంటి ఆరుబయట తన కొడుకును ఎత్తుకొని నిలబడిన కవిత వద్దకు ముసుగు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెతో మాటలు కలిపారు. 'మీరు శ్రీమాన్ భార్యనా అని, మీరు మాకు తెలుసు' అంటూ ఆమె ఒడిలోంచి 2 నెలల పసికందును బలవంతంగా లాక్కొని బైక్‌పై పరారయ్యారు. దీంతో ఒక్కసారిగా నిశ్చేష్టురాలైన కవిత గట్టిగా కేకలు పెట్టింది. ఈ విషయం భర్తకు వెంటనే సమాచారం అందించింది. దీంతో బుధవారం రాత్రి భర్త శ్రీమాన్‌తో కలిసి దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

తల్లి సమాచారంతోనే వెలికితీత..

పసికందును బావిలో పడేసి హత్యచేసిన ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. బుధవారం రాత్రి తన కొడుకును దుండగులు అపహరించారంటూ ఫిర్యాదు చేయడం.. ఆ క్రమంలోనే తల్లి కవితను పోలీసులు ప్రత్యేకంగా విచారించడంతో విస్తుగొలిపే నిజాలు బయటకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విచారణలో ఆమె ఇచ్చిన సమాచారం మేరకే దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఫైర్ సిబ్బంది గురువారం అప్పనపల్లిలోని పెద్ద బావిలో 4 గంటలకు పైగా గాలించి ఎట్టకేలకు ఆ పసికందు మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిసింది. కవితనే ఈ దారుణంకు పాల్పడిందా? లేదా ఎవరైనా ఉన్నారా? అనే విషయంపై విచారిస్తున్నట్లు తెలిసింది.